క్లుప్తంగా

పంచరాయి భూ సమస్య పరిష్కారానికి మోక్షం



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల పంచరాయి భూముల సమస్య పరిష్కారానికి మోక్షం లభించింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరకాల ఆర్డీఓ శ్రీనివాస్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారించాలని ఆదేశించారు. కొప్పుల గ్రామంలో 64ఎకరాల పంచరాయి భూమి ఉండగా 150మంది రైతులు గత కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. వారికి పట్టాలు జారీ కాలేదు. ఈ విషయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరకాల ఆర్డీఓ శ్రీనివాస్‌తో మాట్లాడి భూ సమస్యను పరిష్కరించి రైతులకు పట్టాలు అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మధుసూదన్, వార్డు సభ్యులు గుర్రం సుధాకర్, గ్రామ రైతులను వారి భూములకు సంబంధించిన పత్రాలను ఆర్డీఓ కార్యాలయంలో అందించారు. త్వరలోనే పంచరాయి భూమి సమస్యను పరిష్కరించి పట్టాపాసుబుక్కులు జారీ చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ: కేరళ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇస్తున్నట్లుగా ఇక్కడి కార్మికులకు రోజుకు రూ.600 చొప్పున ఇవ్వాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద మధ్యాహ్న భోజన వర్కర్లు చేస్తున్న నిరాహార దీక్ష బుధవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి, ఉపాధ్యక్షురాలు గద్దం లలిత, నైనాల విజయ, కవిత, రమ, అయిలయ్య, జంగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలి



కాజీపేట అర్బన్: ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. కాజీపేట మండలం రాంపేటలోని పీహెచ్‌సీలో బుధవారం ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలకు సీఐటీయూ తరఫున మద్దతు పలికి వారు మాట్లాడారు. కార్యకర్తలకు నెలకు రూ.18వేల చొప్పున అందజేయాలని సూచించారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డు, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు చెన్నబోయిన శ్రీవాణి, సింగారపు రజిత, కోమల, స్వరూప, రాధ, లత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవపై అవగాహన

నయీంనగర్: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, మాస్టర్‌జీ హై స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత, తడి, పొడి చెత్త ఎలా వేరు చేయడం అనే పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, రాధిక, ఏఓ చతుర్పాల్ సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఐటీసీ ప్రతినిధి పవన్, జవాన్ దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే సీపీఐ ధ్యేయం

మడికొండ: ప్రజా పోరాటాలే సీపీఐ ధ్యేయం అని పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో పార్టీ మండల సమితి సమావేశాన్ని మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపన, అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ,దేశ స్వాతంత్ర్యంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐ ప్రముఖ పాత్ర పోషించిందని గుర్తుచేశారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి కావాలని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు.



ఎల్కతుర్తి : నిమజ్జనానికి బయలు దేరిన గణనాథుడు



ఆత్మకూరు : నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న సీఐ రవిరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు

వినాయకా.. సెలవిక

- అంబరాన్నంటిన నిమజ్జన సంబురాలు
- కోలాటాలు, కేరింతలతో యువకుల ఉత్సాహం
- ప్రశాంతంగా ముగిసిన గణపతి పండుగ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు నవరాత్రి పూజలు నిర్వహించిన భక్తులు గణనాథున్ని ట్రాక్టర్ వాహనాలపై ఎక్కించి డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళతాళాల నడుమ పిల్లలు కోలాటం ఆటలాడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువులల్లో నిమజ్జనం చేశారు. మహిళలు గణనాథునికి నారికేళములు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అపశృతులు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. వేడుకల్లో పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా..మోరియా అంటూ రంగులు చల్లుకొని నృత్యాలు చేసుకుంటూ వెళ్లి చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు. కాగా పలు చోట్ల వినాయక లడ్డూలను వేలం వేశారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జనోత్సవ వేడుకలు బుధవారం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. తొమ్మిదిరోజులు పూజలందుకున్న గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఆసీనులు చేసి భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ, కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ పుర వీధుల గుండా ఊరేగించిన అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా గణపతి బప్పా మోరియా నినాదాలతో చిన్నారులు, యువకుల కేరింతలు మిన్నంటాయి. వినాయక మండపాల్లో భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలను ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమాఫ ర్హీన్ ప్రారంభించారు. నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా స్థానిక సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి దంపతులు గణపతి శోభాయాత్రలో కోలాటాలు ఆడి, నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.



దామెర : శోభాయాత్ర నిర్వహిస్తున్న డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు



ఐనవోలులో..

ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్త, భజన మండళ్ల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి భక్తులు వీడ్కోలు పలికారు. బుధవారం మండపాల్లో పూజలు చేసి ఊరేగింపు నిర్వహించి అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. బైబై గణేష, చల్లంగ చూడు అంటూ వీడ్కోలు పలికారు. మండలంలోని కటాక్షపూర్ పెద్ద చెరువులో గణపతి విగ్రహాలను భక్తుల కేరింతలు, నృత్యాల మధ్య కోలాహలంగా నిమజ్జనం చేశారు. సీఐ రవిరాజు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ ఏఈ రవికుమార్, ఎంపీపీ సుమలత, సర్పంచ్‌లు రబియాబీహుస్సేన్, మచ్చిక యాదగిరి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాయంపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు డప్పుచప్పుళ్ల మధ్య గణేష్ ఊరేగింపు నిర్వహించారు. సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చెరువుల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని చెరువు వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు విద్యుత్ దీపాలు, తదితర ఏర్పాట్లు చేశారు. చెరువుల వద్ద భక్తులు వినాయకులను నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు.

దామెర: మండల వ్యాప్తంగా బుధవారం గణపతి నిమజ్జన వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులకు చివరి రోజుల ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తిగీతాలు ఆలపిస్తూ, నృత్యాలు, కోలాటాలు నడుమ శోభయాత్ర నిర్వహించి దామెర గిద్దె చెరువులో, ఊరుగొండ పెద్ద చెరువులో, కోగిల్వాయి శనిగ చెరువులో, పులుకుర్తి రంగ నాయకుల చెరువులో, ఒగ్లాపూర్ ఈరాయి చెరువులో, పసరగొండ, ల్యాదెళ్ల, వెంకటాపూర్, ముస్త్యాల పల్లి, తక్కళ్లపహాడ్ చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిమజ్జనం చేసే స్థలాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శోభయాత్రల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ముత్యం రాజేందర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పరకాల: గణపతి నిమజ్జన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. వాడవాడ నుంచి కదిలిన గణపతి రథాలకు పట్టణ ప్రజలు కొబ్బరికాయాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపుగా బయలుదేరిన గణపయ్యలను స్థానిక చలివాగులో నిమజ్జనం చేశారు. వాగు వద్ద క్రేన్ ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు వాహనాల నుంచి విగ్రహాలను మున్సిపల్ సిబ్బందితో వాగులో నిమజ్జనం చేయించారు. వాగు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో కార్లు, ఆ టోలు, ద్విచక్ర వాహనాలపై సైతం విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, మున్సిపల్, విద్యుత్‌శాఖ, రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీంతో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

కమలాపూర్ : విశ్వసాయి భజనమండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర





కమలాపూర్‌లో..



శాయంపేటలో..



పరకాల: గణనాథుల ఊరేగింపు



నడికూడ : ఊరేగింపులో గణనాథుడు

పోషకాహారంతోనే ఆరోగ్యం



దామెర : సీమంతం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ

దామెర: పోషకాహారంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. గర్భిణులు తీసుకునే ఆహారంపై పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మఒడి లాంటి పథకాలు ప్రవేశపెట్టి ఆరోగ్య వంతమైన బిడ్డలను సమాజానికి అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, దళితబంధు మండల చైర్మన్ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు వనజ, రజిత, గౌరీ, కోమల, రమ, సంధ్య, ఫాతిమా పాల్గొన్నారు. అలాగే ముస్త్యాలపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, తోట శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : గర్భిణులకు సీమంతాలు చేస్తున్న జిల్లా సంక్షేమాధికారి మధురిమ, ఎంపీపీ సుమలత

ఆత్మకూరు: మహిళలు పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి మధురిమ అన్నారు. మండలంలోని నీరుకుళ్లలోని రైతువేదికలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. నీరుకుళ్ల, పెంచికలపేట, కందిబండ గ్రామాలకు చెందిన గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. హెల్తీ బేబీలకు అవార్డులు, హీమోగ్లోబిన్ 12 కంటే ఎక్కువగాఉన్న గర్భిణులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంపీపీ సుమలత, సీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ పద్మావతి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమంత్, మహిళాసాధికారత కోఆర్డినేటర్ కల్యాణి, హెల్త్ సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- నివాళులర్పించిన బాపూజీ మనుమరాలు కొండా సంధ్యారాణి

పరకాల: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొని అనేక ఉద్యమాలు చేసిన గొప్ప పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన మనుమరాలు కొండా సంధ్యారాణి అన్నారు. ఓ సమయంలో తాను ఇష్టపడిన ఇల్లును కూలగొట్టినా తెలంగాణ కోసం ఉద్యమాన్ని ఆపలేదని కొనియాడారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ డిపో క్రాస్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి అతని మనుమరాలు సంధ్యారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, విగ్రహ కమిటీ కన్వీనర్ డాక్టర్ పోతాని రాజేశ్వర్ ప్రసాద్‌తో పాటు స్థానిక కౌన్సిలర్స్, పద్మశాలి సంఘం, పోపా నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉద్యమాల గడ్డ పరకాలలో తన తాత విగ్రహాన్ని చూడగానే ఎంతో గర్వపడ్డానని అన్నారు. తెలంగాణ కోసం ఆయన అనేక ఉద్యమాలు చేపట్టగా గతంలో పాలించిన పాలకులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసేందుకు చేసిన కుట్రలు కొండా లక్ష్మణ్‌బాపూజీని ఎంతో బాధపెట్టాయన్నారు. అయినా వెనుకడుగు వేయకుండా అందరినీ ఏకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బాసాని దయాకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు, పద్మశాలి ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మంత్రి కాశయ్య, ప్రధాన కార్యదర్శి చిదురాల దేవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, సీనియర్ జర్నలిస్ట్ మెండు రవీందర్ పాల్గొన్నారు.

కమలాపూర్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్విట్ ఇండియా పోరాటం, గైర్ ముల్కీ ఆందోళన, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పద్మశాలీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ కృష్ణప్రసాద్, పద్మశాలి సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్‌బాబు, పట్టణ కార్యదర్శి పులికంటి రాజేందర్, చేనేత సహకార సంఘం మేనేజర్ దామోదర్, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, కనుకుంట్ల అరవింద్, అంజనేయులు, రమేష్, భిక్షపతి, మిట్టిపెల్లి ప్రభాకర్, వెల్ది కుమారస్వామి, రాజేష్, రాజమౌళి, రాజు, శంకరయ్య, నర్సింహస్వామి, కుమారస్వామి, కిషన్ పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి చేనేత సహకార సంఘం పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, కొప్పుల గ్రామంలో పద్మశాలీ సంఘం నాయకులు సామల మధుసూదన్‌లు పూలమాల, నూలుదండలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం, రజాకార్ల దాష్టికానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో పోరాడి తన మంత్రి పదవిని సైతం వదిలేసిన గొప్ప నేత కొండా లక్ష్మణ్‌బాపూజీ అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం పీఏసీ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, చేనేత కార్మికులు రంగు ఆనందం, దాసరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, పద్మశాలి సంఘం నాయకులు నామని సాంబయ్య, రాజయ్య, మార్కండేయ, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.



పరకాల : లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కొండా సంధ్యారాణి, తదితరులు



కమలాపూర్ : నివాళులర్పిస్తున్న పద్మశాలీలు



శాయంపేటలో..

'గౌడ గర్జన'ను జయప్రదం చేయాలి



ఎల్కతుర్తి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు



కమలాపూర్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: గౌడల రాజ్యాధికారమే లక్ష్యంగా హనుమకొండలోని సుబేదారి ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల మైదానంలో అక్టోబర్ 1వ తేదీన నిర్వహించే గౌడ గర్జన సభను విజయవంతం చేయాలని జేఏసీ సంఘాల జిల్లా కన్వీనర్ మార్క అనిల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లో గౌడ గర్జన సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి గీతకార్మికుల హక్కుల సాధనలో వెనుకబడ్డారని, గౌడన్నల సంక్షేమం, రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలనే డిమాండ్‌తో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం గౌడ కులస్తులకు గౌడబంధు ప్రకటించాలన్నారు. జేఏసీ నేతలు సునీల్ గౌడ్, ఏరుకొండ రమేష్‌గౌడ్, అనిల్‌గౌడ్, కంకటి సాగర్‌గౌడ్, గొడిశాల సమ్మయ్యగౌడ్, కుమారస్వామిగౌడ్, భానుప్రకాశ్‌గౌడ్, పృథ్వీరాజ్‌గౌడ్, సదానందంగౌడ్, గోపిగాని లింగయ్యగౌడ్, కరుణాకర్‌గౌడ్, పైడీనందం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అక్టోబర్ 1వ తేదీన హనుమకొండలో నిర్వహించతలపెట్టిన గౌడ గర్జనను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం గౌడగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ, గీతకార్మికులకు రూ.10లక్షల గౌడబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు. గోపా మండల అధ్యక్షుడు పొగాకుల సంతోష్‌గౌడ్, ప్రధానకార్యదర్శి పడాల భాస్కర్‌గౌడ్, జిల్లా జేఏసీ వైస్‌చైర్మన్ ఆముదాలపల్లి మల్లేశం, జేఏసీ కోకన్వీనర్ సోల్తి కిరణ్‌గౌడ్, జేఏసీ కోఆర్డినేటర్ మార్క సునీల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, నాయకులు బూర సతీష్, పొగాకుల రాజు, గుర్రం కృష్ణమూర్తి, పొగాకుల అనిల్ పాల్గొన్నారు.

కమలాపూర్: గౌడ హక్కుల సాధన కోసం హనుమకొండలోని ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో అక్టోబర్ 1వ తేదీన నిర్వహించతలపెట్టిన గౌడ గర్జనను విజయవంతం చేయాలని గౌడ సంఘం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంకటి సాగర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గౌడ కులస్తులతో కలిసి సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ కులస్తులను పాలక ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, గౌడ కులస్తులకు జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, గౌడ కులస్తుల డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి సాధన కోసమే సభ ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు జేరుపోతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొంరయ్య, సభ్యులు సతీష్, దేవేందర్, పరుశురాములు, మల్లేష్, వీరగౌడ్, రవి, రాజేష్, భిక్షపతి, అశోక్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ. 44, 616

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల గౌడ్స్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద లడ్డూ వేలంపాట బుధవారం నిర్వహించగా రూ. 44,616కు చేరింది. అదే గ్రామానికి చెందిన గొడిశాల సాయికుమార్‌గౌడ్ 13కిలోల లడ్డును రూ. 44, 616లకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సాయికుమార్ గౌడ్‌ను సన్మానించి లడ్డూను అందించారు.

సమ్మె బాటపట్టిన ఈ-పంచాయతీ ఆపరేటర్లు

కమలాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు బుధవారం నుంచి సమ్మె బాటకు దిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ-పంచాయతీ ఆపరేటర్లు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా స్పందించడం లేదని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తడక రాణిశ్రీకాంత్, ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమలకు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించకపోగా కనీస గుర్తింపు కూడా లభించడం లేదని, తమ సమస్యలు పరిష్కరించే వరకూ విధుల్లో చేరబోమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ-పంచాయతీ ఆపరేటర్లు శ్రీధర్, రాజేష్, రాము, శివ, శిరీష, జయ, విజయ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీకి సమ్మె నోటీసు అందజేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

క్షయవ్యాధిని నిర్మూలించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దామెర: క్షయవ్యాధిని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి మంజుల అన్నారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడారు. 2025 నాటికి దేశంలో క్షయవ్యాధిని పారద్రోలే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అనంతరం ఏసీఎఫ్ క్యాంపు నిర్వహించి టీబీ లక్షణాలు కలిగిన 75 మంది నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ అశోక్‌బాబు, పీహెచ్ఎన్ లీల, ఎస్టీఎల్ఎస్ టీయూ రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు వనిత, ఉమారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.